## తొలి ఏకాదశి సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు వేదాశీర్వచనం



**దశ, ఓయూ:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ లక్ష్మీ నరసింహాచార్యులు శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు నివాసానికి వెళ్లి వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వదించారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి, ఆయురారోగ్యాలు, ప్రజా సేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు వేణు యాదవ్, గద్ద యుగేందర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో 27 నుంచి 29 వరకు విత్తన మేళాలు

❖ *అన్ని మండలాల రైతు వేదికల్లో ఆరుతడి పంటల విత్తనాల విక్రయం*



**దశ, రంగారెడ్డి:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపేలా రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జూలై 27, 28, 29 తేదీలలో జిల్లాలోని 24 మండలాల రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి సుజాత తెలిపారు. ఈ మేళాల్లో కంది, పెసర, ఆముదం, సజ్జలు, ప్రొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలతో పాటు వివిధ రకాల కూరగాయల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రైతులు తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలమైన నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి, ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## పసుమాములలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు



**దశ, పెద్ద అంబర్ పేట :** మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్, పసుమాముల గ్రామపంచాయతీలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ మల్లేష్ నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు ధృవీకరణ, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను జోర్కా వెంకటరమణ, జి. వినయ్, పి. సిద్ధు, జి. మనోజ్ పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు అయ్యేలా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే ప్రజలు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములై తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పోలీసులకు ఉచిత వైద్య శిబిరం





**దశ, ఓయూ:** శ్రీ ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్, ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పల్లెకి వైద్యం' కార్యక్రమంలో భాగంగా 141వ ఉచిత వైద్య శిబిరాన్ని యాదగిరిగుట్ట డివిజన్ పోలీసు సిబ్బంది కోసం శనివారం నిర్వహించారు. యాదగిరిగుట్టలోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరాన్ని జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. శిబిరంలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, 2డీ ఎకో, బీఎండీ తదితర పరీక్షలు నిర్వహించి, వైద్యుల సలహా మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, న్యూరో, జనరల్ మెడిసిన్ నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం, శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని సూచించారు. విధి నిర్వహణలో ఒత్తిడి కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశమున్నందున పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

శ్రీ ఆర్కే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చావా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనరల్ హెల్త్ చెకప్ చేయించుకోవడం అవసరమని, విధి ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో వంద మందికి పైగా పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. శిబిరం విజయవంతానికి సహకరించిన కామినేని హాస్పిటల్ వైద్యులు, వారి బృందం, శ్రీ ఆర్కే హాస్పిటల్ సిబ్బంది, క్యాంపు ఇన్‌చార్జి ఎంపల్లి కొండల్‌రెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## పద్మారావు నగర్ లో సాయి సప్తాహ ఉత్సావాలు

**దశ, ఓయూ:** పద్మారావునగర్‌లోని శ్రీ సాయి వ్యాధి నివారణ ఆశ్రమంలో శ్రీ సాయి సప్తాహ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆశ్రమ ప్రాంగణంలో లక్ష్మీ నారాయణ కల్యాణం, శ్రీ సాయి పంచముఖ ఆంజనేయ సేవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వందలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబాను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాల వితరణతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

## తార్నాకలో ఘనంగా వన మహోత్సవం



**దశ, ఓయూ:** పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా తారక సేవ సమాఖ్య ఆధ్వర్యంలో, హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ సహకారంతో తార్నాకలో వన మహోత్సవం-2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని మొక్కలను స్వీకరించారు. హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ అసిస్టెంట్ డైరెక్టర్ దొనేపూడి చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వంశీకృష్ణ, సెక్షన్ ఆఫీసర్ సాగర్ సరీన్ ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. నమోదు చేసుకున్న కుటుంబాలకు మామిడి, ఉసిరి, మునగతో పాటు రెండు అలంకార మొక్కలు కలిపి మొత్తం ఐదు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళలు, యువత, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నల్లూరి శివరాం ప్రసాద్, తోటకూర చంద్రమౌళయ్య, వసుంధరా దేవి పాల్గొన్నారు. తారక సేవ సమాఖ్య వ్యవస్థాపక ట్రస్టీలు అడుసుమిల్లి చిట్టి వీరయ్య, మన్నె నాగమల్లేశ్వరి, కాట్రగడ్డ నరేంద్రబాబు ముఖ్య అతిథులను సత్కరించారు. ప్రతి ఇంటికీ ఐదు మొక్కలు - పచ్చని భవిష్యత్తుకు మన వంతు బాధ్యత అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ట్రస్టీలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యం, విద్య, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన హెచ్‌ఎండీఏ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, దాతలు, మీడియా ప్రతినిధులు, స్థానిక ప్రజలకు తారక సేవ సమాఖ్య కృతజ్ఞతలు తెలిపింది.



## కేపీహెచ్‌బీలో కుబేరా సిల్క్స్ ప్రారంభించిన లావణ్య త్రిపాఠి

**దశ, హైదరాబాద్ :** తెలంగాణలో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, సంప్రదాయ వస్త్రాలకు ప్రసిద్ధి చెందిన కుబేరా సిల్క్స్ తన 6వ బ్రాంచ్‌ను కెపిహెచ్బి లోని ధర్మారెడ్డి కాలనీ లో హీరోయిన్ లావణ్య త్రిపాఠి ప్రారంభించారు.లావణ్యత్రిపాఠి మాట్లాడుతూ కుబేరసిల్క్స్‌లో కలెక్షన్స్ చాలా బాగున్నాయి,ఆడవారికి చీరలు ప్రతి అకేషన్ కి మొదటి ఛాయిస్ గా ఉంటుందని నా దగ్గర చాలా వెరైటీలు అన్ని కలర్స్ ఎప్పుడు రెడీగా ఉంచుకుంటాను, వారు మరిన్ని బ్రాంచీలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా కుబేరా సిల్క్స్ వ్యవస్థాపకులు ఎం.శ్యాంసుందర్,జి.శ్రీనివాస్,డా.జి.షాలిని మాట్లాడుతూ,నాణ్యత,విశ్వసనీయత,అందుబాటు ధరలతో వినియోగదారులకు ఉత్తమమైన షాపింగ్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో విస్తరణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త బ్రాంచ్‌లో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, ఫ్యాన్సీ వేర్, సంప్రదాయ దుస్తులు విస్తృతంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## ఘనంగా ముదిరాజ్ మహానేత ఎర్ర సత్యం జయంతి వేడుకలు



**దశ, భువనగిరి:** ముదిరాజ్ మహానేత ఎర్ర సత్యం జయంతి సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ చౌరస్తా అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కొమిలిసేటి నరసింహులు మరియు యాదాద్రి భువనగిరి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు షేక్ రియాజ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఎర్ర సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముదిరాజ్ సమాజ అభ్యున్నతి కోసం ఎర్ర సత్యం చేసిన పోరాటం, సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీసీ వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం జరగాలంటే ఎర్ర సత్యం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ బహుజన వర్గాల హక్కుల సాధన కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ సంఘ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎర్ర సత్యంకు ఘన నివాళులర్పించారు.

## పాత్రికేయుల సమస్యలపై రేపే 'ఛలో పార్లమెంట్'

❖ *జంతర్‌మంతర్ వద్ద టీడబ్ల్యూజేఎఫ్ ధర్నా*

**దశ, హైదరాబాద్:** పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జూలై 27న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 'ఛలో పార్లమెంట్' పేరుతో ఒకరోజు ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఢిల్లీకి బయలుదేరారు. జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్‌ల పునరుద్ధరణ, జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు, జాతీయ పెన్షన్ పథకం అమలు, జర్నలిస్టుల రక్షణ చట్టం, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు చట్టబద్ధత కల్పించడం, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర నాయకులు, సభ్యులు పాల్గొంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం, ఎంపీల దృష్టికి తీసుకెళ్లేందుకు తొలిసారిగా 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మామిడి సోమయ్య తెలిపారు.



## చట్టం ముందు అందరూ సమానులే

❖ జడ్జి కాసరగడ్డ దీప

**దశ, హుజూర్‌నగర్:** నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం శిక్షార్హులేనని, చట్టం ఎవరికీ చుట్టం కాదని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప స్పష్టం చేశారు. శనివారం హుజూర్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఒక చట్టాన్ని రూపొందించినప్పుడు అందులో పౌరుల హక్కులు, విధుల గురించి స్పష్టంగా పేర్కొంటారని జడ్జి తెలిపారు. ఆ చట్టంలో ఉండే విషయాలన్నీ పౌరులకు తెలుసనే భావన కూడా చట్టంలో పొందుపరిచి ఉంటుందని, అందుకే "ఇది నేరం అని తెలియక చేశాం" అంటే చట్టం ఊరుకోదని హెచ్చరించారు. విద్యార్థులు డ్రగ్స్ వాడకానికి, వాటిని కలిగి ఉండటానికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే సాంకేతికతను మంచి మార్గంలో వినియోగించాలి తప్ప చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వాడితే శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే యావజ్జీవ కారాగార శిక్షతో పాటు మరణశిక్ష సైతం విధించే అవకాశం ఉన్న పోక్సో, నిర్భయ వంటి కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని ఆమె గుర్తుచేశారు. అందువల్ల యువత నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం చిత్తవుతుందని హెచ్చరించారు.




కాలేజీలు, విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని, కాబట్టి ఏ ఒక్కరూ ర్యాగింగ్‌కు పాల్పడవద్దని విద్యార్థులకు హితవు చెప్పారు. విద్యార్థులు ఒక మంచి లక్ష్యాన్ని ఎంచుకుని, దానిని చేరుకోవడానికి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సోమపంగు రామారావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.వి. రమణారెడ్డి, న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు, ఎస్.ఐ హనుమా నాయక్, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రామాలయంలో తొలి ఏకాదశి పూజలు



**దశ, హుజూర్‌నగర్:** శ్రీ వేణుగోపాల సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో తొలిఏకాదశి పండుగ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుప్రభాతసేవ, ఆరాధన, స్వామివారికి అమ్మవారికి అభిషేకం, బాల బాగం నివేదన పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నమయ్య భజన మండలి, గీతాగోవిందం, లక్క వెంకన్న బృందం, కటాకమ్మగూడెం భజన్మండాలి, రైతు మహిళలు మండలి వారిచే ఏక నామ సంకీర్తన పారాయణంలో పాల్గొన్నారు. తదనంతరం భక్తులకి గోత్రనామములతో అర్చన పూజలు జరిపారు. సాయంత్రం సుదర్శన నారసింహ, శ్రీరామ కృష్ణ సహిత ఆంజనేయ, వరుణ యాగం తదుపరి పూర్ణాహుతి నిర్వహించారు. తదనంతరము నివేదన, మంగళ నిరాజన మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వినియోగము జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు జగన్నాథ చార్యులు, శ్రీనివాస చార్యులు అర్చకులు నర్సింహాచార్యులు, భాస్కరచార్యులు మురళీకృష్ణమా చార్యులు బాచి మంచి వెంకటేశ్వర శర్మ, సిహెచ్ భిక్షం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## చెంచువాడ ప్రాథమిక పాఠశాల పరిశీలన



**దశ, పెబ్బేర్:** పెబ్బేరు మండల పరిధిలోని 'ఎంపీపీఎస్ పెబ్బేరు చెంచువాడ' ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి శ్రీ ఎస్. జయరాములు శనివారం ఆకస్మికంగా సందర్శించి, పాఠశాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉదయమే ప్రార్థన సమయానికి పాఠశాలకు హాజరైన ఆయన..విద్యార్థుల హాజరుతో పాటు వారి వివిధ కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్శనలో భాగంగా ప్రధానంగా ఎఫ్.ఎల్.ఎన్ పరీక్షా విధానాన్ని ఎంఈఓ పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసే విధానం, ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, మూల్యాంకన ప్రక్రియపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. అనంతరం నాలుగో తరగతి విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరీక్షించి..వారి చదవడం, రాయడం, అర్థం చేసుకునే సామర్థ్యాలను గమనించారు. పాఠశాలలోని ప్రీప్రైమరీ తరగతులను కూడా సందర్శించి, చిన్నారులకు అందిస్తున్న విద్యాబోధన, అభ్యాస వాతావరణాన్ని పరిశీలించారు.

పాఠశాలలో అమలువుతున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, పరిశుభ్రత, ఆహార నిర్వహణను ఎంఈఓ స్వయంగా తనిఖీ చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, విద్యార్థుల హాజరు పట్టికలు, పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ, పాఠశాల నిర్వహణపై ఎంఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థికి ప్రాథమికంగా చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల అభివృద్ధి పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. చిన్నరాములు, ఉపాధ్యాయులు స్వాతి, మాధురి, రాధలతో పాటు ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు కృష్ణవేణి, పుష్పవతి పాల్గొన్నారు.

## వైభవంగా గుమ్మడివల్లి బోనాల జాతర



**దశ, అశ్వారావుపేట:** అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి గ్రామంలో గ్రామీణ పండుగ వాతావరణం ఉట్టిపడేలా బోనాల మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ, అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఏటా ఆనవాయితీగా వచ్చే ఈ జాతర సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో అశ్వారావుపేట బీఆర్ఎస్ పార్టీ కీలక నాయకురాలు కాసాని నాగ శేషా పద్మ, 14వ వార్డు కౌన్సిలర్ డా. ఉదయ జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నెత్తిన బోనాలు ధరించి, మంగళ వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ భక్తులతో కలిసి కోలాహలంగా సాగిన ఊరేగింపులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ దేవతల ఆశీస్సులు ఉంటే గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉంటాయని తెలిపారు. గుమ్మడివల్లి గ్రామ ప్రజలతో పాటు అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలందరికీ అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతీ ఒక్కరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సైలా మోహన్ రావు, సీహెచ్. వెంకటేష్ రావు, శ్రీను, మల్లికార్జున్, వీరబాబు, సురేష్, బుట్టా సత్యం లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, మహిళలు, గ్రామ ప్రజలు అత్యంత ఉత్సాహంగా, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గోదావరి పైపు లైన్ ఎవరూ వినియోగించొద్దు



❖ జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

**దశ, మంచిర్యాల:** జిల్లాలోని జైపూర్ మండలం శివ్వారం గ్రామపంచాయతీ పరిధిలో త్రాగునీటి సరఫరా కోసం గోదావరి నది నుండి ఏర్పాటు చేసిన పైపులైన్‌ను ఎవరు వినియోగించరాదని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. పైప్ లైన్ ను గ్రామ సర్పంచ్ అక్రమంగా వేలం వేశారనే ఫిర్యాదులు అందిన నేపథ్యంలో శనివారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, మిషన్ భగీరథ ఈ.ఈ. వెంకటేశ్వర్, డిప్యూటీ ఈఈ కిరణ్ లతో కలిసి విచారణలో భాగంగా గ్రామపంచాయతీని సందర్శించి గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన పైపులైన్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను అనధికారికంగా వినియోగించడం, నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఒకవేళ ఎవరైనా ఈ పైపులైన్‌ను వినియోగించినట్లయితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. ఇట్టి పైప్ లైన్ ను ఎవరు వినియోగించరాదని తెలుపగా గ్రామ ప్రజలందరూ ఏకగ్రీవంగా స్పందిస్తూ ఇకపై ఎవరూ ఈ పైపులైన్‌ను ఉపయోగించరాదని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎ.ఈ. ఎన్. రాజమల్లయ్య, శివ్వారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సృజన, సర్పంచ్ అంజన్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్ద చల్లా విశ్వంబర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇదీ విద్యార్థుల విజయం: పువ్వాడ అజయ్



**దశ, ఖమ్మం :** ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. విద్యార్థుల పోరాటం ఫలించి సాధించిన విజయం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..ఈ విజయం ఒక సమస్య పరిష్కారానికే పరిమితం కాదని, దేశంలో మార్పు కోరుకునే యువత సంకల్పానికి ప్రతీకగా నిలిచిందన్నారు. విద్యార్థులు, యువత ఆకాంక్షలను విస్మరించి పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ ఉద్యమం గట్టి హెచ్చరికగా మారిందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరించే ప్రభుత్వాలను ప్రజలు సహించరని, సమయం వచ్చినప్పుడు తగిన తీర్పు ఇస్తారనే విషయాన్ని ఈ విజయం మరోసారి చాటిచెప్పిందన్నారు. ఇకపై విద్యార్థులు, యువత సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో స్పందించి, విద్యా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని పువ్వాడ అజయ్ కుమార్ కోరారు.

## 6వ వార్డులో పారిశుధ్య పనుల పరిశీలన : మున్సిపల్ కమిషనర్



**దశ, బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపాలిటీ 6వ వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణితో కలిసి పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వార్డులోని కాలువలు, డ్రైనేజీలు, చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వర్షాల కారణంగా కాలువల్లో చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై తక్షణమే స్పందించిన కమిషనర్..కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని, డ్రైనేజీల్లో ఎక్కడా చెత్త నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం వార్డులోని ప్రధాన వీధులు, కాలువలు, డ్రైనేజీలు, చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు.

వర్షాకాలంలో దోమల వ్యాప్తి చెందకుండా, వ్యాధులు నివారించేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి మాట్లాడుతూ..వార్డులో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే మున్సిపాలిటీ ప్రాధాన్యత అని తెలిపారు. అధికారులు పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని, మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## వినాయకపురంలో వైభవంగా బోనాలు



❖ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన భక్తజనం

**దశ, అశ్వారావుపేట:** అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల మహోత్సవాన్ని శనివారం గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఈ పవిత్ర వేడుకలో గ్రామ మహిళలు ప్రదర్శించిన భక్తిప్రపత్తులు, నియమ నిష్ఠలు భక్తజనాన్ని మైమరిపించాయి. ఉదయం నుంచే మహిళలు సాంప్రదాయ వస్త్రధారణతో మట్టి కుండలను పూలమాలలు, వేపాకులతో శోభాయమానంగా అలంకరించి బోనాలను సిద్ధం చేసుకున్నారు. తలపై బోనమెత్తి, పాదరక్షలు లేకుండా సుమారు 2 కిలోమీటర్ల మేర కాలి నడకన ఊరేగింపుగా సాగారు. దారిపొడవునా ఉన్న ప్రతి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొడుతూ హారతులు ఇచ్చారు. డప్పు వాయిద్యాల మోతలు, "జై ముత్యాలమ్మ తల్లి" నినాదాలతో వినాయకపురం గ్రామం భక్తిమయంగా మారింది.

అనంతరం ఊరేగింపు గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ చిలకగండి ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుంది. మహిళలు అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటా సుఖశాంతులు విలసిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భక్తిపూర్వకంగా మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా గ్రామస్తులందరూ ఒకే కుటుంబంలా కలిసి ఈ వేడుకను నిర్వహించడం వినాయకపురం ప్రత్యేకతగా నిలిచింది. పూజల అనంతరం భక్తులందరికీ అన్న సమారాధన (మహా అన్నదానం) నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను తరతరాలుగా కాపాడుతూ వస్తున్న వినాయకపురం గ్రామ ప్రజల ఐక్యతను, మహిళల అచంచల భక్తిశ్రద్ధలను పలువురు ప్రశంసించారు.

## సర్ ప్రోగ్రాం త్వరగా పూర్తి చేయండి: మంత్రి జూపల్లి కృష్ణారావు

**దశ, కొల్లాపూర్:** కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండలంలో శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల పరిధిలోని అన్ని గ్రామాల బిఎల్ఓలు, బిఎల్ఏలు, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్ కార్యక్రమంపై అధికారులకు మంత్రి పలు సూచనలు, సలహాలు అందించారు.

ఈ ప్రక్రియలో పాల్గొంటున్న ప్రతీ ఒక్క అధికారి ఎక్కడా చిన్నపాటి తప్పులు కూడా దొర్లకుండా, బాధ్యతాయుతంగా సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న కొండూరు గ్రామ సర్పంచ్ కేతూరి ధర్మతేజ మాట్లాడుతూ.. సర్కార్యక్రమ ప్రాముఖ్యతను, వివిధ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెంట్లవెల్లి మండల రెవెన్యూ అధికారులు, మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.